# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 53 5-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




# ఇరాన్‌పై నిప్పుల వర్షం!

- ఎడతెరిపి లేని దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్, అమెరికా
- ఇరాన్ అణు ప్రాజెక్టు కేంద్రం ధ్వంసం
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు
- దుబాయ్‌లోని యూఎస్ రాయబార కార్యాలయంపై దాడి
- సౌదీ రాయబార కార్యాలయంపై, రిఫైనరీపై మళ్లీ దాడికి యత్నం
- టర్కీపై దాడులకు దిగిన ఇరాన్ పశ్చిమాసియాను లక్ష్యం చేసుకుంటాం
- సైనిక, ఆర్థిక వ్యవస్థల్ని నాశనం చేస్తాం





# పెద్దలు 'వేం' చేశారు

### ఇప్పటికే ఖరారైన అభిషేక్ సింఘ్వీ అభ్యర్థిత్వం..

### సీఎం పట్టుదలతో సన్నిహితుడికి దక్కిన అవకాశం

### ఎట్టకేలకు ఉత్కంఠకు తెర... అంతకుముందు జూమ్‌లో మంతనాలు

కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై గత కొద్దిరోజులుగా నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఎన్నో మల్లగుల్లాలు, సుదీర్ఘ చర్చల అనంతరం కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ నుంచి బరిలో నిలిచే ఇద్దరు రాజ్యసభ నఅభ్యర్థులను ఖరారు చేసింది. పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతోపాటు, రాష్ట్రానికి చెందిన సీనియర్ నేత

# గణపతి లొంగుబాటు?

- అమిత్ షా సమక్షంలో లొంగిపోయేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే రాష్ట్ర పోలీసులతో టచ్‌లోకి వచ్చినట్టుగా సమాచారం
- సేఫ్ ప్యాసేజ్ కల్పించడంతో నేపాల్ నుంచి ఢిల్లీకి..!
- హైదరాబాద్‌లో దేవ్‌జీ లొంగిపోయినప్పుడే గణపతి ప్రస్తావన..
- తాజాగా ఢిల్లీలో కేంద్ర హోంమంత్రితో సీఎం రేవంత్, డీజీపీ, ఎస్ఐబీ చీఫ్ భేటీ
- మావోయిస్టు అగ్రనేత లొంగుబాటుపైనా చర్చ!

హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో అత్యంత సీనియర్ నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో లొంగిపోవడానికి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల తెలంగాణ డీజీపీ ముందు లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, రాజిరెడ్డి, పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న తదితరులు, ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమైన సందర్భంలోనే.. గణపతి గురించిన ప్రస్తావన వచ్చినట్లు సమాచారం. కాగా త్వరలో జరగబోయే మావోయిస్టు రహిత భారత్ సదస్సుతో పాటు మావోయిస్టు నేతల లొంగుబాట్లపై చర్చించడానికి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీ



శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ చీఫ్, ఐజీ సుమతి బుధవారం ఢిల్లీలో అమిత్‌షాతో సమావేశమయ్యారు.




# పూటకో బదిలీతో దెబ్బతింటున్న పాలన

- ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు
- ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శ
- ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారనద
- రెండున్నరేళ్లలై దుసార్లు భారీ ఎత్తున బదిలీ చేశారన్న హరీశ్ రావు

# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

- గత పాలనలో పారిశ్రామిక విధ్వంసం.. ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని వివరణ
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం
- ఏపీకి క్యూ కడుతున్న ప్రపంచ స్థాయి సంస్థలు
- గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 20 నెలల కాలంలో సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభ వేదికగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగ కల్పన, వైద్య, విద్య తదితర కీలక రంగాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. కేవలం 20 నెలల్లోనే రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని సీఎం అధికారికంగా ప్రకటించారు.



# ఇవి అడ్రస్ లేని కంపెనీలా?

- రాబోయే ఐదేళ్లలో కేవలం ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్న లోకేశ్
- గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల ఏర్పాటుపై రాద్ధాంతం తగదని హితవు
- పెట్టుబడుల ఆకర్షణ కోసం గుజరాత్ తరహాలో రూపాయికే భూమి పాలసీ
- రూ.1.50 లక్షల కోట్ల విలువైన 52 ఒప్పందాలతో 2.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, వివిధ పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గణాంకాలతో సహా వివరించారు. అలాగే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో కలిపి 30,500 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను కల్పించి మాట నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డ సీఎం, 2019-24 మధ్య కాలంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల వల్ల 913 కంపెనీలు మూతపడ్డాయని ఆర్బీఐ నివేదికే స్వయంగా వెల్లడించిందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు చిరునామాగా ఉన్న ఏపీని, ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా మారుస్తున్నామని చెప్పారు. కేవలం 26 కొత్త పాలసీలతో వేగంగా అనుమతులు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో ఏకంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా భవిష్యత్తులో 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఎన్డీఏ కూటమి పాలనపై నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్, టాటా-టీసీఎస్ వంటి దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, త్వరలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్లకు శంకుస్థాపన చేయబోతున్నామని ప్రకటించారు. అలాగే ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, టాటా సంస్థ ద్వారా రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మరో యూనిట్ రాబోతోందని చెప్పారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఎకోసిస్టమ్, విశాఖలో ఐటీ హబ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువత నైపుణ్యాలకు పదును పెడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదని, అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుందని స్పష్టత ఇచ్చారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు కనీసం భూమిని కూడా చూపించలేకపోయారని విమర్శించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, సూర్యలంక, గండికోట వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని సీఎం మండిపడ్డారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం పారదర్శక విధానంతో అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యా రంగంలోనూ తెలుగు భాషను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభకు...
# కాంగ్రెస్ అభ్యర్థులు వీరే!



(మొదటి పేజీ తరువాయి)

వేం నరేందర్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. అభ్యర్థుల ఎంపిక వ్యవహారం కొలిక్కిరాగానే, కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు స్వయంగా వేం నరేందర్‌రెడ్డికి ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలియజేయడంతోపాటు అభినందనలు తెలిపారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఖరారైన అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేస్తారు. అభ్యర్థుల ఖరారుకు ముందు ఢిల్లీ వేదికగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. అభ్యర్థి ఎంపికకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఢిల్లీకి చేరుకున్నా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితర కీలక నేతలు అందుబాటులో లేరు. దీంతో సీఎం వారితో జూమ్ యాప్ ద్వారా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ వర్చువల్ మీటింగ్‌లో ప్రధానంగా మూడు పేర్ల చుట్టే సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, వినయ్‌కుమార్ పేర్లను అధిష్టానం తీవ్రంగా పరిశీలించింది. ఈ జూమ్ మీటింగ్‌లో అభ్యర్థి ఎంపిక విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి మధ్య చర్చ జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. వినయ్‌కుమార్‌కు అవకాశం ఇస్తే బాగుంటుందనే వైఖరితో ఆయన వైపు మొగ్గు చూపినట్టు తెలిసింది. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తనకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డికి ఈసారి ఎలాగైనా అవకాశం ఇవ్వాల్సిందేనని గట్టిగా పట్టుబట్టారు. రాష్ట్ర రాజకీయ సమీకరణాలు, పార్టీలో ఆయన సీనియారిటీని ఈ సందర్భంగా సీఎం వివరించినట్టు సమాచారం. సుదీర్ఘ చర్చల అనంతరం సీఎం పట్టుదలకే అధిష్టానం గౌరవం ఇచ్చింది. వేం నరేందర్‌రెడ్డి వైపే మొగ్గుచూపి, జాతీయ కోటాలో అభిషేక్ మను సింఘ్వీతో కలిపి ఆయన పేరును ఖరారు చేసింది.

# గణపతి లొంగుబాటు?



ఈ సందర్భంగా గణపతి లొంగుబాటు అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు బుధవారం సాయంత్రం నుంచే దేశ రాజధానిలో గణపతి లొంగుబాటు అంశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అత్యంత విశ్వసనీయంగా అందిన సమాచారాన్ని బట్టి.. వృద్ధాప్యం, అనారోగ్య కారణాల నేపథ్యంలో గణపతి తెలంగాణ పోలీసులతో రహస్య సంప్రదింపులు జరుపుతున్నారని, ఆయన త్వరలోనే లొంగిపోవడానికి మార్గం సుగమం అయిందని తెలుస్తోంది. వయస్సు, అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గణపతి సాధారణ జీవితం గడపాలని కుటుంబ సభ్యులు సైతం కోరుతున్నట్లు సమాచారం. కాగా ఆపరేషన్ కగార్ తరువాత పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిన గణపతి దేశం విడిచి నేపాల్ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా తెలంగాణ పోలీసులతో టచ్‌లోకి వచ్చారని.. ఉన్నతాధికారులు ఆయనకు సేఫ్ ప్యాసేజ్ కల్పించి నేపాల్ నుంచి ఢిల్లీకి వచ్చేలా చూశారని ఉన్నతస్థాయి వర్గాల ద్వారా తెలుస్తోంది. మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న గణపతి అనారోగ్య కారణాల వల్ల మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నారు. అయినా జనజీవన స్రవంతిలోకి రాకుండా ఉద్యమంలో కొనసాగారు. మూడు నాలుగు దశాబ్దాల పాటు పీపుల్స్‌వార్‌ను ఆ తర్వాత మావోయిస్టు పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, సాయుధ పంథావైపు నడిపించడంలో గణపతి కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో పోలీసులకు పలుమార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నారు. ఏది ఏమైనా గణపతి లొంగిపోతే మావోయిస్టు ఉద్యమం ముగింపునకు వచ్చినట్టేనని అంటున్నారు. గణపతి 1949లో జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం బీర్పూర్‌లో జన్మించారు. ఆయన్ను ఉద్యమంలో టీచర్ అని పిలుస్తారు. 1970లో జరిగిన రైతు పోరాటాలు, జగిత్యాల జైత్రయాత్ర తర్వాత నక్సల్ ఉద్యమంలో కొండపల్లి సీతారామయ్య తర్వాత ఆ స్థాయి లీడర్‌గా గణపతికి గుర్తింపు లభించింది. మావోయిస్టు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఆయన పర్యవేక్షణలో దేశంలో సంచలన దాడులు జరిగాయి. మావోయిస్టు నెట్‌వర్క్ విస్తరణలో గణపతిది కీలక పాత్రగా చెబుతారు. గణపతితో పాటు ఆయన సహచరిణి సుజాత కూడా ఇప్పటివరకు అజ్ఞాతంలోనే ఉన్నారు.

# ఇరాన్‌పై నిప్పుల వర్షం!

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధం మరింత భీకర రూపు దాలుస్తోంది. ఇరాన్‌తో పాటు లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ బుధవారం ఐదో రోజు అక్షరాలా నిప్పుల వర్షం కురిపించింది. ఇరాన్‌లోని కీలక ప్రభుత్వ వ్యవస్థలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా టెహ్రాన్‌తో పాటు కోమ్, ఉర్మియా, కెర్మన్‌షా తదితర నగరాలపై కూడా రోజంతా పలు దఫాలుగా బాంబులు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇస్ఫహాన్‌లోని క్షిపణి నిల్వల కేంద్రంపై క్షిపణుల వర్షం కురిపించింది. టెహ్రాన్ సమీపంలోని నూతన అణు ప్రాజెక్టు కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన వైఏకే130 యుద్ధ విమానాన్ని టెహ్రాన్ గగనతలంలో కూల్చేసినట్టు సైన్యం వెల్లడించింది. దాడుల ధాటికి తాళలేక దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాన్ని కూడా ఇరాన్ వాయిదా వేసుకుంది! ఇప్పటిదాకా ఇరాన్‌కు చెందిన 17 యుద్ధ నౌకలను పేల్చేసినట్టు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌లో 2,000కు పైగా లక్ష్యాలను ఛేదించినట్టు అమెరికా సైన్యం సెంట్రల్ కమాండ్ చీఫ్, నేవీ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. "వందలాది ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, లాంచర్లు, డ్రోన్లను నాశనం చేశాం. ఇరాన్ ఇప్పటిదాకా 500కు పైగా బాలిస్టిక్ క్షిపణులు, 2,000కు పైగా డ్రోన్లు ప్రయోగించింది"అని తెలిపారు. ఇరాన్‌లో ఇప్పటిదాకా 1,045 మందికి పైగా మరణించినట్టు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ఇరాన్ సైనిక సామర్థ్యం బాగా క్షీణించిందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి బ్రిగేడియర్ ఎఫీ డెఫ్రిన్ పేర్కొన్నారు. దాంతో దాడుల తీవ్రత కూడా తగ్గిందని చెప్పుకొచ్చారు. బుధవారం ఇరాన్ కూడా దీటుగా ప్రతి దాడులకు దిగింది. జెరూసలేం తదితర నగరాలపైకి భారీగా క్షిపణులను ప్రయోగించింది. సౌదీ అరేబియా, ఖతర్‌తో పాటు పలు గల్ఫ్ దేశాలపై కూడా దాడులను నిర్నిరోధంగా కొనసాగించింది. దుబాయ్‌లోని యూఎస్ రాయబార కార్యాలయంపై డ్రోన్లతో దాడి చేసింది. దాంతో కార్యాలయం భారీ మంటల్లో చిక్కింది. అయితే సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్టు అమెరికా తెలిపింది. సౌదీ అరేబియాలోని అమెరికా రాయబార కార్యాలయంతోపాటు అక్కడి రస్ అనూరా చమురు శుద్ధి కేంద్రంపై కూడా మళ్లీ డ్రోన్లతో దాడికి ప్రయత్నించింది.

బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ఐదో ఫ్లీట్ వ్యవస్థపైనా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. అంతేగాక తన దాడులను టర్కీకి కూడా విస్తరించింది! ఇరాన్ నుంచి తమ గగనతలంలోకి దూసుకొచ్చిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్టు టర్కీ ప్రకటించింది. తమపై అకారణ దాడికి దిగిన అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియా దేశాలు కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. పశ్చిమాసియాలోని సైనిక, ఆర్థిక వ్యవస్థలన్నింటినీ నాశనం చేసేందుకు సన్నద్ధం అవుతున్నామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది! లెబనాన్‌పై దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ బుధవారం మరింత పెంచింది. ఎడతెరిపి లేకుండా వచ్చిపడుతున్న క్షిపణులు, బాంబులతో బీరూట్ దద్దరిల్లిపోతోంది. అరమౌన్, సాదియత్ తదితర నగరాలపైనా దాడులు కొనసాగుతున్నాయి. బలైనట్టు తక్షణం సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందిగా సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామవాసులను ఇజ్రాయెల్ హెచ్చరించింది. దాడుల ధాటికి దక్షిణ లెబనాన్‌లో ఇప్పటికే వేలాది మంది నిర్వాసితులుగా మారారు.

# ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# ఇరాన్ నూతన సారథి మొజ్తబా!

కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) మంగళవారం ఆయనను ఎన్నుకున్నట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఇరాన్ ఇంటర్నేషనల్ వార్తాసంస్థ బుధవారం ఈ మేరకు పేర్కొంది. దీన్ని ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై గత శనివారం ఇజ్రాయెల్, అమెరికా జరిపిన భీకర దాడుల్లో ఖమేనీ మరణించడం తెలిసిందే. 56 ఏళ్ల మొజ్తబా ఆయన రెండో కుమారుడు. ఆయనకు పాలనానుభవమేదీ లేదు. ఇప్పటిదాకా తెర వెనకే తండ్రి తరఫున వ్యవహారాలను చక్కబెడుతూ వచ్చారు. వారసత్వ రాజకీయాలకు ప్రస్తుత ఇరాన్ పాలక వర్గం పూర్తిగా వ్యతిరేకమన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో మొజ్తబా ఎన్నికపై కమిటీలో పలువురు అభ్యంతరం వెలిబుచ్చినట్టు తెలుస్తోంది. అయితే ఇరాన్‌లో సర్వశక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తీవ్ర ఒత్తిడితో చివరికి ఆయన నియామకానికి పచ్చజెండా ఊపినట్టు ఇరాన్ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఐఆర్‌జీసీపై మొజ్తబాకు పూర్తిస్థాయిలో పట్టుంది. దాని వ్యవహారాలను చాలా ఏళ్లుగా పూర్తిగా ఆయనే చూసుకుంటున్నట్టు చెబుతారు. వారసత్వ పాలనను వ్యతిరేకిస్తూ రాచరికాన్ని కూలదోసిన 1979 నాటి ఇస్లామిక విప్లవంలో ఖమేనీ కీలక పాత్ర పోషించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు వారసత్వంగా పాలన పగ్గాలు చేపట్టడాన్ని ఇరాన్ ప్రజలు ఏ మేరకు ఆమోదిస్తారన్నది చూడాలి. ఇరాన్‌లో అధ్యక్షునిగా ఎవరున్నా సర్వం సహా అధికారాలు మాత్రం సుప్రీం నేత చెప్పుచేతల్లోనే ఉంటాయి. సైన్యంతో పాటు అత్యంత శక్తిమంతమైన ఐఆర్‌జీసీ కూడా పూర్తిగా ఆయన కనుసన్నల్లోనే పని చేస్తుంది. శనివారం నాటి దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు మొజ్తబా భార్య జహ్రా హదద్ ఆదెల్, ఆయన చిన్న కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత మొజ్తబా ఒక్కసారి కూడా బహిరంగంగా కన్పించలేదు. ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో అజ్ఞాతంలో ఉంటూ ఇరాన్ ప్రతి దాడులను పర్యవేక్షిస్తున్నట్టు చెబుతున్నారు.

# పూటకో బదిలీతో దెబ్బతింటున్న పాలన


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.

# ఇవి అడ్రస్ లేని కంపెనీలా?

"గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్, ఆసిప్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు అడ్రస్ లేని కంపెనీలా? యువతకు ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు భూములిస్తే తప్పేంటి?" అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యర్థి పక్షాన్ని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో ఐటీ శాఖ పద్దులపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ.. 99 పైసలకే (రూపాయికి) భూమి కేటాయింపులపై టీమ్-11 తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. కేవలం రాజకీయ విద్వేషంతోనే మంచి కంపెనీలపై బురదజల్లుతున్నారని, కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. ఐదేళ్లలో ఒక్క ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశాన్ని ఒక సవాలుగా తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.1.50 లక్షల కోట్ల విలువైన 52 ఎంవోయూలు కుదుర్చుకున్నామని, తద్వారా 2.3 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ టాటా నానో ఫ్యాక్టరీ కోసం రూపాయికే భూమి ఇచ్చి, తద్వారా భారీ ఆటోమొబైల్ ఎకో సిస్టమ్‌ను ఎలా సృష్టించారో.. అదే స్ఫూర్తితో ఏపీలోనూ 'లిఫ్ట్' పాలసీని తీసుకొచ్చామన్నారు. టాప్-500 కంపెనీలు వచ్చి భారీగా ఉద్యోగాలు ఇస్తే ఉచితంగానైనా భూమి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. గత ప్రభుత్వం ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ఒక యుద్ధమే చేసిందని మంత్రి ధ్వజమెత్తారు. 2014-19 మధ్య చంద్రబాబు కృషితో విశాఖకు వచ్చిన ఒక ఫార్చ్యూన్-500 కంపెనీపై ఆనాడు వైసిపి నేతలు పార్లమెంటులో చేసిన నిరాధార ఆరోపణల వల్ల.. సదరు కంపెనీ సీఈవో తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. గత ఐదేళ్లలో ఒక్క ఐటీ కంపెనీకి కూడా ఇన్సెంటివ్స్ ఇవ్వకుండా టెర్రరిజాన్ని తలపించేలా పాలన సాగించారని ఆరోపించారు. చంద్రబాబు అనుభవమే బ్రాండ్‌గా పెట్టుబడులు తెస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే కాగ్నిజెంట్ సీఈవోతో మాట్లాడి ఒప్పించామని, ఫలితంగా విశాఖలో 25 వేల ఉద్యోగాల కల్పనకు ఆ సంస్థ ముందుకొచ్చిందన్నారు. అలాగే గూగుల్ మెగా డేటా సెంటర్, టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, ఆసిప్ సెమీకండక్టర్ యూనిట్ వంటివి విశాఖ కేంద్రంగా రాబోతున్నాయన్నారు. "రాజకీయాలు రాష్ట్రం లోపల చేద్దాం.. బయటకు వెళ్లినప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం కలిసి పనిచేద్దాం" అని ప్రత్యర్థి పక్షానికి మంత్రి హితవు పలికారు.

# చౌటుప్పల్‌లో జోరుగా మాల్ ప్రాక్టీస్?




- ముందుగానే ఎగ్జామినేషన్ సెంటర్లతో ఒప్పందాలు?
- ఫీజుల వసూలుపై ఉన్న శ్రద్ధ.. చదువుపై ఏది?
- పరీక్షల వేళ ఓ ప్రైవేట్ కాలేజీ 'సెటిల్ మెంట్లు'?
- చౌటుప్పల్‌లో 'మాల్ ప్రాక్టీస్' రాజకీయం!
- పేరు గొప్ప.. ఊరు దిబ్బ: కార్పొరేట్ కాలేజీ బండారం
- ఇన్విజిలేటర్ల సహకారం కోసం ముందస్తు వ్యూహాలు?
- కష్టపడి చదివే విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకం..
- అక్రమాలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించేనా?

**హైదరాబాద్, మార్చి 4 (తొలివెలుగు డెస్క్) :** అక్షరాలు దిద్దించాల్సిన విద్యాసంస్థలే అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయన్న ఆరోపణలు చౌటుప్పల్ పట్టణంలో కలకలం రేపుతున్నాయి. 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందంగా ఓ కార్పొరేట్ ప్రైవేట్ కాలేజీ విద్యా ప్రమాణాలను పక్కనపెట్టి, పరీక్షల్లో 'మాల్ ప్రాక్టీస్'కు పాల్పడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన సంస్థలే ఫలితాల కోసం అడ్డదారులు వెతుకుతున్నాయన్న చర్చ విద్యా వర్గాల్లో జోరందుకుంది.

### ఎగ్జామినేషన్ సెంటర్లతో ముందస్తు 'డీల్'?

స్థానికంగా పేరున్న ఓ బడా కార్పొరేట్ కాలేజీ పరీక్షల షెడ్యూల్ రాకముందే ఎగ్జామినేషన్ సెంటర్లతో కుమ్మక్కైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ విద్యార్థులకు అనుకూలంగా ఉండే కేంద్రాలు కేటాయించేలా తెరవెనుక పావులు కదిపారనే ప్రచారం సాగుతోంది. పర్యవేక్షణ సడలింపులు, ఇన్విజిలేటర్ల సహకారం కోసం భారీగా 'సెటిల్‌మెంట్లు' జరిగాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.



### ఫీజులపై ఉన్న శ్రద్ధ.. చదువుపై ఏది?


ఫీజుల వసూళ్లలో మాత్రం ఎటువంటి రాజీ లేకుండా వ్యవహరించే ఈ కాలేజీ, బోధన విషయంలో విఫలమైందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ, పరీక్షల సమయంలో మాత్రం అడ్డదారుల్లో పాస్ చేయించే ప్రయత్నాలు చేయడం గమనార్హమని పేర్కొంటున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను 'మాల్ ప్రాక్టీస్' ద్వారా గట్టెక్కించే వ్యూహం అవలంబిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా కష్టపడి చదివే విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు.

### ప్రధాన ఆరోపణలు

- పరీక్షా కేంద్రాల ఎంపికలో కుమ్మక్కు
- ఇన్విజిలేటర్ల సహకారం కోసం ముందస్తు ప్రయత్నాలు
- పర్యవేక్షణను నామమాత్రం చేయించే వ్యూహాలు
- ఫలితాల మార్కెటింగ్‌కే ప్రాధాన్యం, విద్యా ప్రమాణాలకు నిర్లక్ష్యం

### విద్యాశాఖ స్పందిస్తుందా?

పరీక్షల వేళ ఇలాంటి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. పరీక్షా కేంద్రాల వద్ద ఆకస్మిక తనిఖీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా నిరంతర నిఘా అవసరమని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో, పరీక్షల పారదర్శకతను ఎలా కాపాడుతారో వేచి చూడాల్సి ఉంది.



## ఘనంగా ఉప్పల రమేష్ జన్మదిన వేడుకలు

**రాజపేట, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రాజపేట రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక దర్శనం అనంతరం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జర్నలిస్టులు, వర్తక వ్యాపారులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ పార్టీల ప్రముఖులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సాంప్రదాయానికి విరుద్ధంగా కేక్ కట్ చేయకుండా ఆధ్యాత్మికంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉప్పల రమేష్ సామాజిక సేవలను కొనియాడారు. సోషల్ మీడియా, ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ఉప్పల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.



## జైలు లోను హింసించారు

అక్రమంగా తనపై కేసులు న మోదు చేసి ఆదిలాబాద్ జైల్లో పెట్టిన కాంగ్రెస్ పార్టీ నాయ కులు పోలీసులతో కలిసి జై ల్లోనూ తనను వేధింపులకు గురి చేశారు అని బి ఆర్ ఎస్ పార్టీ నేత మాజీ ఎమ్మెల్యే బా ల్క సుమన్ అన్నారు. 14 రోజులపాటు అదిలాబాద్ జి ల్లా జైలులో శిక్షను అనుభ విం చి బుధవారం బెయిల్ పై వి డుదలైన బాల్క సుమన్ ఈ సందర్భంగా విలేకరులతో మా ట్లాడారు. తనను అరెస్టు చేసి జైల్లో పెట్టడం కక్షపూరిత మైం దని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్ప డు తుందని ఆరోపించారు. హోలీ పండుగ, తన కుమారు డి జన్మదినం లను కూడా ఆ నందోత్సహాల మధ్య జరుపు కోనివ్వ కుండా, కుటుంబ స భ్యులతో సంతోషంగా గ డు పుకొనివ్వకుండా తనను జైల్లో పెట్టారని పేర్కొన్నారు. 10 లు టిఆర్ఎస్ ప్రభుత్వం పరి పా లిం చినప్పటికీ ఎప్పుడు కూ డా ఇలాంటి కక్ష సాధింపు చ ర్యలకు పూనుకోలేదని, కాంగ్రె స్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కూడా పూర్తి కాక ముందే అనేక కక్ష సాధింపు చ ర్యలకు పాల్పడుతోందని, ఇ ప్పుడు తనను జైల్లో పెట్టి కసి తీర్చుకుందని ఆరోపించారు. సిపిఐ తన మిత్రపక్ష పార్టీతో కలిసి మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకునేందుకు 14 మంది సభ్యులతో తాము కార్యాలయానికి వెళుతుండగా కాంగ్రెస్ గుండాలు తమపై దాడి చేశారని తమను హాల్లోకి వెళ్ళనివ్వకుండా మంత్రిని వెళ్ళనిచ్చారని అందువల్ల తాము ప్రశ్నించినందుకు తమ పై వారే దాడి చేసి అక్రమ కేసు లు బనాయించి తమ పార్టీ నాయకులు 20 మందిని జైల్లో పెట్టారని ఆయన వాపోయా రు. కేతన్పల్లి మున్సిపల్ పరిధిలో కేవలం ఏడువార్డు కౌన్సిలర్లను గెలిచిన కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించు కునేందుకు కుట్ర చేస్తున్నాయ ని ఆయన ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు



గురిచేసిన తమ పార్టీ అభ్యర్థులు ఏమా త్రం లొంగడం లేదని, అయితే మరో విధంగా తామె కిడ్నాప్ చేసినట్లు తమ పార్టీ వార్డు స భ్యులతో పోలీస్ స్టేషన్ లో ఫి ర్యాదులు చేయించి కేసులు పె ట్టించేందుకు కుట్రలు చేస్తున్నా రని పేర్కొన్నారు. పోలీసులు కూడా కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లు గా మారారని ఆరోపించారు. చట్టం ప్రకారం నడుచుకోకుం డా కాంగ్రెస్ పార్టీ నేతలకు చు ట్టాలుగా మారి వారికి అను కూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎ న్నికల కమిషన్ జోక్యం చేసు కొని ప్రత్యేక అధికారిని నియ మించి, క్యాతన్ పల్లి మున్సి పల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్ని కలను పూర్తి చేయాలని నిష్ప క్ష పాతంగా వ్యవహరిం చాల ని ఆయన కోరారు.





## గ్రామ అభివృద్ధికి నిధులివ్వండి

**- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు బొంధుగుల సర్పంచ్ వినతి**

**రాజపేట, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** గ్రామ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని బొంధుగుల సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కోరారు. బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని మౌలిక వసతుల సమస్యలను వివరించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్ బీర్ల ఐలయ్య సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబిద్, వార్డు సభ్యుడు శీను రమేష్, గ్రామస్తులు సిద్దులు, రాజు, రాములు, కిషన్, కనుకయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- నమిలలో అంగన్‌వాడీ కమిటీ సమావేశం

**రాజపేట, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** చిన్నారుల ఆరోగ్యం, విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నమిల సర్పంచ్ పులి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భరత్ కుమార్ గౌడ్ సూచించారు. మండలంలోని నమిల అంగన్‌వాడీ కేంద్రం-1లో బుధవారం ఏఎల్ఎంసీ (అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల సమగ్రాభివృద్ధికి గ్రామస్తుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గిరెడ్డి పద్మ, గర్భిణీలు, బాలింతలు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# స్కామ్ కథ కంచికేనా?

కథలన్నీ కంచికి చేరతాయో లేదోగానీ... రాజకీయ ప్రయోజనాలనాశించి పెట్టే కేసులన్నీ, సీబీఐ, ఈడీల సుదీర్ఘ దర్యాప్తు అనంతరం గాలికి కొట్టుకుపోతున్నాయి. ఆ వరసలో ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు తాజా ఉదాహరణ. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలతోపాటు 23 మందిపై అవినీతి, కుంభకోణం ఆరోపణలు చేస్తూ 2022లో సీబీఐ దాఖలు చేసిన కేసులో అందరూ నిర్దోషులని ఢిల్లీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సీబీఐకి చెంపపెట్టు. పనిలో పనిగాతెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవితను కూడా నిందితురాలిగా చేర్చారు. ఆమె సైతం ఇప్పుడు నిర్దోషిగా తేలారు. 2021లో ఢిల్లీ ప్రభుత్వం కొందరికి లబ్ధి చేకూరేలా మద్యం విధానం తీసుకొచ్చిందంటూ ఈ కేసు అల్లారు. అధికారంలో కొచ్చిన ఏ రాజకీయ పక్షమైనా అమల్లో ఉన్నవాటిని కాదని, తమ ఆలోచనలకు అనుగుణంగా కొత్త విధానాలు ప్రవేశపెడుతుంది. అవన్నీ సరైనవి కాకపోవచ్చు. వాటి వెనక స్వీయ ప్రయోజనాలుండొచ్చు. ఆ నిర్ణయాల పర్యవసానంగా ఖజానా నష్టపోతే, ప్రజల ప్రయో జనాలు దెబ్బతింటే చర్యలు తీసుకోవాల్సిందే. వాటినెవరూ ప్రశ్నించరు. కానీ అందుకు తగిన మౌలిక ఆధారాలు, ప్రాతిపదిక ఉండాలి. విధానం మార్చడం దానికదే ఒక కుంభ కోణంగా చిత్రించటం, ఆ పేరిట కేసులు, అరెస్టులతో వేధించటం, ఏళ్ల తరబడి దర్యాప్తు, చివరకు నిరూపించలేక న్యాయస్థానాలతో చీవాట్లు తినడం ఏం మర్యాద? ఇందువల్ల దర్యాప్తు సంస్థల విశ్వసనీయత దెబ్బతినడం లేదా? తాత్కాలికంగా మీడియాలో భారీ యెత్తున ప్రచారం జరగొచ్చు. నిప్పు లేనిదే పొగ రాదని జనం అభిప్రాయపడేలా చేయొచ్చు. ఎన్ని చేసినా ఆరోపణల్ని రుజువు చేయటం అంతిమంగా దర్యాప్తు సంస్థ బాధ్యత.

పత్రికల్లో రోజుల తరబడి పతాక శీర్షికలు ఆక్రమించి, టీవీ చానెళ్లలో గంటల తరబడి చర్చలకు కారణమైన కేసులు చివరకు దూదిపింజెల్లా తేలిపోవటం, గాలి పోగేయటం తప్ప ఇందులో ఆవగింజంతైనా వాస్తవం లేదని తేలడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక ఈ కేసుల్ని ఆధారం చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఎవరికివారు ఇష్టానుసారం వ్యాఖ్యా నాలు చేయటం, అవమానించేలా శీర్షికలు పెట్టడం మరో ప్రహసనం.

ఎవరికీ తెలియని 'సౌత్ గ్రూప్'ను సృష్టించి, దానికి లబ్ధి కలిగేలా కేజ్రీవాల్ ప్రభుత్వం కొత్త మద్యం విధానం తెచ్చిందని, ఇందులో రూ. 100 కోట్లు చేతులు మారాయని ఆరోపిస్తూ అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించారు. 2023 ఫిబ్రవరిలో మనీశ్ సిసోడియానూ, 2024 మార్చిలో కవితనూ, కేజ్రీవాల్‌నూ అరెస్టు చేశారు. అన్ని కేసుల్లో మాదిరే ఇక్కడ కూడా మనీశ్ సన్నిహితుడు దినేశ్ అరోరా, ఏపీకిచెందిన మాగుంట రాఘవరెడ్డి, శరత్ చంద్రారెడ్డి వంటివారిని అప్రూవర్లుగా మార్చుకున్నారు. ఈ ముగ్గురూ పూసగుచ్చినట్టు చెప్పారంటూ లీకులిచ్చారు. కానీ అలా అంటే సరిపోదు... వాటిని ధ్రువపరిచే సాక్ష్యాలుండాలి. కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపిస్తే కాదు... అంత మొత్తం ఎలా ప్రయాణించిందో, ఏయే ఖాతాలకు మళ్లిందో చూపాలి. అడుగడుగునా ఆధారాలుండాలి. ఫలానా అంశాలు రాబట్టామని ఏకరువు పెట్టినంత మాత్రాన కుదరదు. వాటిమధ్య పరస్పర సంబంధాన్ని సందేహాతీతంగా రుజువు పరచాలి. ఆ సంగతలా ఉంచి కనీసం అవినీతి నిరోధకచట్టం సెక్షన్ 7, 13 కింద ఆరోపించిన లంచం ఆరోపణల్ని కూడా సీబీఐ ప్రాథమికంగా నిరూపించలేకపోయింది. అందుకే కాబోలు దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యకు కోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసులో సీబీఐ అప్పీలుకెళ్లింది. అంటే ఈడీ దర్యాప్తు ఇంకా సాగుతూనేఉంటుందనుకోవాలి. కాకపోతే ఇందులో అవినీతిపరుడిగా ముద్రపడిన కేజ్రీవాల్‌నిరుడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయారు. నిందితులంతా కారాగారవాసంతో సహా మూడున్నరేళ్లపాటు నానా కష్టాలు పడ్డారు.



# పశ్చిమాసియా మంటలు!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూల బాధ్యతారహిత చర్యతో ఒక్కసారిగా పశ్చిమాసియా నిప్పులకొలిమైంది. శనివారం ఉదయం ఒక పథకం ప్రకారం ఇజ్రాయెల్, అమెరికా సైనిక బలగాలు ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక నగరాలు, పట్టణాలపై బాంబులతో, క్షిపణులతో విరుచుకుపడి ఆరంభంలోనే ఇరాన్ మత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీతోపాటు ఆయనతో చర్చిస్తున్న కీలకమంత్రులు, రక్షణరంగ బాధ్యులతో సహా దాదాపు 30 మందిని హత మార్చాయి. పర్యవసానంగా యుద్ధం ఆరంభమైన మూడో రోజుకే ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా దేశాలన్నీ భగ్గున మండుతున్నాయి. అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా సాగుతున్న ఈ దాడులతో కోట్లాదిమంది ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టు కుని ఉన్నారు. మంగళవారం విమాన రాకపోకలు మొదలెడతామని దుబాయ్ అంటు న్నది. సాధ్యాసాధ్యాలపై సంశయాలున్నాయి.

సాధారణంగా యుద్ధం తొలి దశలో దేశాధినేతలు, ఇతర కీలక బాధ్యుల జోలికి పోరు. చర్చలకు రప్పించటం, రాజీ తప్ప మరే మార్గమూ లేదన్న అభిప్రాయం కలిగించడం దీని వెనకుండే వ్యూహం. కానీ ట్రంప్, నెతన్యాహూల దుందుడుకుతనం ఆ అవ కాశానికి శాశ్వతంగా తలుపులు మూసింది. అందుకే యుద్ధం ఎడతెగకుండా సాగుతుందన్న అభిప్రాయం బలపడుతోంది. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడ్డ ఎప్‌స్టీన్‌తో ఉన్న నీతిబాహ్య సంబంధాలు బట్టబయలు కావటం, స్వీయ తప్పిదాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ దివాలా స్థితికి చేరుకుని సాధారణ ప్రజానీకం దుర్భరమైన స్థితిలో బతుకీడ్వటంవంటి పరిణామాల నేపథ్యంలో వచ్చే నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగించారు. అటు పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి పదవీభ్రష్టత్వం, జైలు తప్పవని బెంగటిల్లుతున్న నెతన్యాహూ సరిజోడీ అయ్యారు. ఇద్దరికిద్దరూ ప్రపంచాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టారు. అంతక్రితం మాటెలా ఉన్నా పశ్చిమాసియాకు సంబంధించి అమెరికా మూడున్నర దశాబ్దాలుగా కట్టుకథలతో కాలక్షేపం చేస్తోంది. అకారణంగా దాడులకు దిగుతూ, జనహననానికి పాల్పడుతూ తప్పుడు సాకులు వెదుకుతోంది. మొదట ఇరాక్‌కువైట్‌ల మధ్య చిచ్చురగిల్చి, ఆ తర్వాత ఇరాక్‌ను అదుపు చేయడానికంటూ 199091లో 'ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్' పేరిట అమెరికా విరుచుకుపడింది. కనీసం అప్పుడు భద్రతా మండలి అనుమతి తీసుకుంది. 35 దేశాలను తోడుతెచ్చుకుంది. అసత్యాలే చెప్పినా దేశ ప్రజలనుద్దేశించి సీనియర్ బుష్ నాలుగు దఫాలు ప్రసంగించారు. కానీ చివరకు అదంతా అమెరికా మాయోపాయం వల్లే జరిగిందని ఆలస్యంగా గ్రహించిన చాలా దేశాలు సీనియర్ బుష్ కుమారుడు జార్జి డబ్ల్యూ బుష్ ఆధ్వర్యంలో సాగిన 2003 నాటి 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్' యుద్ధానికి మొహం చాటేశాయి. 'జీవ రసాయన ఆయుధాల' సాకుతో జరిపిన ఆ యుద్ధానికి బ్రిటన్, పోలెండ్, ఆస్ట్రేలియాలు మాత్రమే సహకరించాయి. భద్రతామండలి ఆమోదం దక్కలేదు. 2015 నాటికి 'జీవ రసాయన ఆయుధాలు' కూడా బూటకమని తేలింది. అందుకే కావొచ్చు... ట్రంప్ భద్రతామండలి సంగతలా ఉంచి, కనీసం చట్ట ప్రకారం అమెరికా ప్రతినిధుల సభ అనుమతి సైతం తీసుకోకుండా ఇప్పుడు చిచ్చు రగిల్చారు. ప్రపంచంలో జరిగే ఏ యుద్ధంలోనూ తలదూర్చబోనని హామీ ఇచ్చి ట్రంప్ గద్దెనెక్కారు. తీరా అందుకు విరుద్ధమైన పోకడలుపోతున్నారు. వాస్తవానికి అమెరికాఇరాన్‌లు ఒప్పందానికి చేరువలోవున్నాయని మధ్యవర్తి ఒమన్ ప్రకటించింది. కానీ 24 గంటలు గడవకుండానే ఏకపక్షంగా ట్రంప్ ఈ దుస్సాహసానికి తెగబడ్డారు. ఇరాన్‌తో స్నేహం నటిస్తూనే సౌదీ ద్రోహం చేసిందనీ, ఖమేనీపై దాడి వెనక దాని పాత్ర ఉన్నదనీ మీడియా కథనం. తమ సైనిక స్థావరాలుంటే ఇరుగుపొరుగు కన్నెత్తి చూడరని చెబుతూ 80వ దశకం నుంచి గల్ఫ్ దేశాలన్నిటా అమెరికా వాటిని నెలకొల్పింది. ఇరాన్ ప్రతీకార దాడులు అదంతా భ్రమగా తేల్చాయి. ఇప్పుడు హోర్ముజ్ జలసంధి మూతబడింది. ట్రంప్ నెతన్యాహూ ద్వయం కదిలించిన ఈ తేనెతుట్టె ఇంకెన్ని పరిణామాలకు దారి తీస్తుందో,ఎంత జన నష్టానికీ, విధ్వంసానికీ కారణమవుతుందో చూడాల్సి ఉంది.

# చిగురాశలపై పిడుగుపాటు

సమాజంలో ఉండే అసమానతలకూ, అంతరాలకూ చట్టాల ద్వారా, మధ్యవర్తిత్వంతో సహా ఇతరేతర మార్గాల ద్వారా సామరస్యపూర్వకమైన పరిష్కారం సాధించటం రాజ్యం చేయాల్సిన పని. అందుకు రాజ్యాంగం, దాని ద్వారా ఏర్పడే భిన్న వ్యవస్థలు పనిచేస్తుంటాయి. కుటుంబాల్లో తరాల మధ్య తలెత్తే సమస్యలకు కూడా ఆ పరిధిలోనే పరిష్కారాలుంటాయి. ఇతరత్రా సమస్యల మాటేమో గానీ, పెళ్లి విషయంలో మాత్రం అదేం కుదరదంటున్నది గుజరాత్ ప్రభుత్వం. వివాహం గురించి తల్లిదండ్రులకు చెప్పి, వాళ్ల అనుమతి తీసుకోవాలని ఆంక్షలు విధించటానికి సిద్ధపడుతోంది. ఇందుకోసం 2006 నాటి వివాహ నమోదు చట్టాన్ని సవరించదల్చుకున్నట్టు ప్రకటించింది. పరస్పరం ఇష్టపడి పెళ్లాడాలనుకునే జంటలకు ఇప్పటికే అనేకానేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కులాలు, మతాలు, ప్రాంతాలు, ఆర్థిక అసమానతలు అందులో కొన్ని. ఈ గోదాలోకి తాను కూడా జొరబడి గుజరాత్ సర్కారు ఏం సాధించదల్చుకున్నదో అనూహ్యం. దప్రజాస్వామ్యంలో 18 ఏళ్ల వయసు నిండినవారు ఓటేయటానికి, పోటీ చేయటానికి అర్హులు. ప్రభుత్వాలను మార్చవచ్చు. జనం ఆమోదం పొంది ఎన్నికైతే ప్రభుత్వంలో భాగమై విధానాలు రూపొందించవచ్చు. కానీ ఆ వయసువారు తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకోవటానికి వీల్లేదని, అందుకు మరొకరి ఆమోదముద్ర తప్పనిసరని అనటం ఆశ్చర్యకరం. ఇలాంటి తలకిందుల ఆలోచనలు చేయటం గుజరాత్‌తోనే మొదలు కాలేదు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఈ పనే చేశాయి. ఎనిమిదేళ్ల క్రితం కేరళకు చెందిన హదియా అనే యువతి కేసులో... తనకు నచ్చిన జీవితభాగస్వామి ఎవరో నిర్ణయించుకునే స్వేచ్ఛ మైనారిటీ తీరిన ప్రతి ఒక్కరికీ ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ బంధంలో తల్లిదండ్రులు గానీ, కుల మత పెద్దలు గానీ జోక్యం చేసుకోవడం చెల్లదని చెప్పింది. నచ్చిన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవటం రాజ్యాంగం 21వ అధికరణం ద్వారా ప్రసాదించిన జీవించే హక్కులో భాగమని కూడా తెలిపింది. 2021లో అలహాబాద్ హైకోర్టు, కర్ణాటక హైకోర్టులు సైతం ఈ సంగతినే స్పష్టం చేశాయి. గత వారం గుజరాత్ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి వివాహ నమోదు చట్టాన్ని సవరించాలనుకోవటానికి చూపిన కారణాలు హాస్యాస్పదమైనవి. పెళ్లిళ్ల నమోదు నిబంధనల్ని కఠినతరం చేయాలని వివిధ సామాజిక సంస్థల నాయకుల నుంచి వినతులొచ్చాయట. బాధ్యతాయుతమైన ప్రభుత్వమైతే అది






# న్యాయవ్యవస్థపై దాడి

న్యాయవ్యవస్థపై దుమ్మెత్తి పోసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన దుందుడుకు ప్రయత్నం బెడిసికొట్టింది. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో ఱఱ. ఈ వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు చేపట్టి కేంద్రానికి తలంటు పోసింది. నిన్న గురువారం విచారణ సందర్భంగా ధర్మాసనం దీని వెనుక 'లోతైన కుట్ర' ఉందని తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. చిరు ప్రాయంలోని విద్యార్థుల మెదళ్లలోకి ఇలాంటి అపోహలతో కూడిన తప్పుడు అభిప్రాయాలను ఎక్కించడం శుద్ధ తప్పని సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఉతికి ఆరేయడం గమనార్హం. కోర్టు కోపాగ్నిని చల్లార్చేందుకు ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. సొలిసిటర్ జనరల్ ద్వారా బేషరతు క్షమాపణలు చెప్పించింది. పుస్తకాల పంపిణీ ఆపేస్తామని హామీ ఇచ్చింది. అయినా కోర్టు శాంతించలేదు. ఆ పాఠమున్న పుస్తకాన్ని నిషేధించింది. ఏ రూపంలోనూ దానిని పంపిణీ చేయరాదని ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ ఆదేశాల అమలుపై నివేదిక సమర్పించాలని గడువు కూడా విధించింది. ఈ వ్యవహారాన్ని దేశం ముందుకు తేవడంలో మీడియా నిర్వహించిన పాత్రను ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేకంగా ప్రశంసించడం విశేషం. ఇదేదో కింది స్థాయి వ్యక్తులు యథాలాపంగా చేసిన మామూలు పొరపాటు కానేకాదు. ఇదంతా పైనున్న 'పెద్దల' ఆశీస్సులతో, వారి కనుసన్నల్లోనే జరిగిందనేది నూటికి నూరుపాళ్లు వాస్తవం. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను కేంద్ర పాలకులు ఇష్టారాజ్యంగా మారుస్తుండటం మొదటినుంచీ జరుగుతున్నది. పాఠ్యపుస్తకాల్లోని చరిత్రను తనకు నచ్చిన చట్రంలో ఇరికించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు గతంలో తీవ్ర విమర్శల పాలయ్యాయి. ఇప్పుడు న్యాయవ్యవస్థపై అవే పాఠ్యపుస్తకాలను ఉపయోగించుకోవడం విస్మయం కలిగిస్తున్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలను ఒకటొకటిగా అదుపులోకి తెచ్చుకునేందుకు తదేక దీక్షగా ప్రయత్నిస్తూనే ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను తన రాజకీయ అవసరాలకు వాడుకోవడంలో ఆరితేరింది. ఎన్నికల సంఘాన్ని తన జేబుసంస్థగా మార్చుకొని ఆడిస్తున్నది. ఈ తరహా సొంత ఎజెండాలో భాగంగానే న్యాయవ్యవస్థపై నిరంతరం దాడి చేస్తున్నది.

# రంజాన్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



- సామరస్యంగా పండుగ జరుపుకోవాలి
- ప్రార్థనా స్థలాల వద్ద వసతుల కల్పనకు ఆదేశం
- శాంతి కమిటీ భేటీలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- ట్రాఫిక్, పార్కింగ్‌పై పోలీసుల ప్రత్యేక నిఘా

**యాదాద్రి భువనగిరి, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** రాబోయే రంజాన్ పండుగను ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను సోదరభావంతో, శాంతి భద్రతలకు భంగం కలగకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రార్థనా స్థలాల వద్ద తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలను సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ అధికారులు పండుగ రోజుల్లో ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల సహకారంతో రంజాన్ పండుగను విజయవంతంగా పూర్తి సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ అధికారి జయమ్మ, మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



- బొందుగులలో ముత్యం రాజు ఉదారత

**రాజపేట, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని బొందుగుల గ్రామానికి చెందిన అమరాజు యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన దశదినకర్మ సందర్భంగా బాధిత కుటుంబానికి బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యం రాజు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యం రాజు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. యాదయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పుట్ట వీరయ్య, అమరాజు శ్రీను, సిద్దులు, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.

# రంగుల హేలలో చిన్నారుల మురిపెం

- రాజపేట అంగన్‌వాడీ కేంద్రంలో హోలీ వేడుకలు
- చిన్నారులతో కలిసి రంగులు చల్లుకున్న టీచర్ భాగ్యలక్ష్మీ



**రాజపేట, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో హోలీ పండుగను బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొనడంతో కేంద్రం పండుగ శోభతో కళకళలాడింది. అంగన్వాడీ టీచర్ రాపాక భాగ్యలక్ష్మీ చిన్నారులతో కలిసి రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరిపారు. పిల్లలు పరస్పరం రంగులు పూసుకుంటూ ఆనందంగా గడిపారు. పండుగ సందర్భంగా హోలీ పండుగ యొక్క ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. చెడు మీద మంచి గెలిచిన సందర్భంగా హోలీని జరుపుకుంటారని తెలిపారు. పండుగలు పిల్లల్లో ఆనందాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని కలిగిస్తాయని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి పాల్గొని ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్ పిల్లలకు, తల్లిదండ్రులకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

# వెటర్నరీ సబ్ సెంటర్లలో కనీస వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

**యాదాద్రి భువనగిరి, మార్చి 4 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న వెటర్నరీ సబ్ సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని టీఎస్జీ వెటర్నరీ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. సబ్ సెంటర్లలో తాగునీరు, విద్యుత్, కూర్చునే సదుపాయాలు వంటి ప్రాథమిక వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు వాష్‌రూమ్ సౌకర్యం లేకపోవడం వల్ల అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మహిళా సిబ్బంది వాష్‌రూమ్ సౌకర్యం లేక నీళ్లు తాగడానికే భయపడే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలు అందించడంలో వెటర్నరీ సబ్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందువల్ల జిల్లాలోని అన్ని సెంటర్లలో మహిళలకు ప్రత్యేక వాష్‌రూములు, తాగునీరు, విద్యుత్ తదితర ప్రాథమిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ ఫోరం జిల్లా అధ్యక్షుడు సిద్ధగోని వెంకటరమణ, జిల్లా కార్యదర్శి భూషబోయిన నరసింహ యాదవ్, గౌరవ అధ్యక్షుడు పిండం శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్, జిల్లా నాయకుడు నల్లమాసు ఉపేందర్ గౌడ్, సహాయ కార్యదర్శులు నల్లమాసు జహంగీర్, ఈరబోయిన మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



- ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- వైద్యులు అంకితభావంతో పనిచేయాలి: కలెక్టర్
- గర్భిణీలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**యాదాద్రి భువనగిరి, మార్చి 4 ( తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న విభాగాలు, వైద్యులు, సిబ్బంది సంఖ్యపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది ఇన్‌పేషెంట్లు చేరుతున్నారో వివరాలు సేకరించారు. అనంతరం వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడారు. వైద్య సిబ్బంది సేవలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన ఔషధాల నిల్వలను పరిశీలించారు. గడువు ముగిసిన మందులు లేకుండా క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని సూచించారు. మందులు ఇచ్చే ముందు రెండు సార్లు పరిశీలించాలని, పేషెంట్లకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని పరీక్షలను అక్కడే నిర్వహించాలని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంపొందించేలా పనిచేయాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. అదేవిధంగా జీజీహెచ్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన ఫర్నిచర్ కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పాండు నాయక్, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# పిల్లలతో కలెక్టర్ ముచ్చట.. సమస్యల పరిష్కారానికి హామీ

- బాలసదనంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ
- విద్యార్థుల కోరిక మేరకు మ్యూజిక్ టీచర్ నియామకానికి కలెక్టర్ ఆదేశం

**యాదాద్రి భువనగిరి, మార్చి 4 (తొలివెలుగు న్యూస్) :** బాలసదనంలో ఉన్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరిలోని మీనానగర్ ప్రాంతంలో ఉన్న బాలసదనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలసదనంలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, హాజరు నమోదు పుస్తకాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వారు చదువుతున్న తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో ముచ్చటించి భోజనం నాణ్యతపై ఆరా తీశారు. పిల్లలను “మీకు ఏమైనా కావాలా?” అని అడగగా, మ్యూజిక్ టీచర్ అవసరమని వారు కోరారు. దీనిపై తాత్కాలికంగా మ్యూజిక్ టీచర్‌ను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ హెల్త్ ప్రొఫైల్ ఉందో లేదో పరిశీలించారు. బాలసదనంలో వాటర్ ఫిల్టర్ పనిచేయకపోవడంతో వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. బెడ్ షీట్లు సరిగా లేనందున కొత్త బెడ్ షీట్లు అందించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న కొత్త భవనం పనుల పురోగతిని కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్ రామలింగం, భువనగిరి తహసీల్దార్ జగన్ మోహన్ ప్రసాద్, బీఆర్‌బీ కోఆర్డినేటర్ అనంతలక్ష్మి, యశోద, బాలసదన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# 12 కోట్ల పారితోషికం

దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా నంబర్ వన్ హీరోయిన్‌గా కొనసాగుతున్న నయనతార మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ సూపర్‌స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం టాక్సిక్లో ఆమె 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మార్చి 19న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాలో నయనతార గన్ పట్టుకుని కనిపించిన ఫస్ట్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో హైప్ తెచ్చింది. ఫిలిం నగర్ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం నయనతార మొదట రూ.18 కోట్ల పారితోషికం డిమాండ్ చేయగా, నిర్మాతలతో చర్చల అనంతరం రూ.12 కోట్లకు అంగీకరించినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.500 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ, రుక్మిణీ వసంత్ వంటి నటీమణులు ఉన్నప్పటికీ, నయనతార పాత్రే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సమాచారం.

# విరోష్ బాక్సులో ఏముంది




టాకీస్: నటులు రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ గత నెల 26న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వివాహానంతరం హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోని పలు ఆలయాల్లో అభిమానులకు స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ బాక్స్‌లకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానిని సంధ్యా రెడ్డి మిట్టా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోలో 'విరోష్ స్వీట్ బాక్స్'లో నాలుగు రకాల మిఠాయిలు ఉన్నట్లు వెల్లడైంది. ప్రతి బాక్స్‌లో నూతన దంపతుల ఫోటోతో పాటు వ్యక్తిగత సందేశం కూడా ఉంది. ఒక్కొక్కరికి ఒకటి కంటే ఎక్కువ బాక్స్‌లు ఇచ్చినట్లు, అన్నప్రసాదం కూడా నిర్వహించినట్లు ఆమె తెలిపింది. ఉదయ్ పూర్ లోని ఐటీసీ మేమెంటోస్‌లో జరిగిన ఈ వివాహంలో తెలుగు, కొడవ సంప్రదాయాలు పాటించారు. రేపు హైదరాబాద్ లోని తాజ్ కృష్ణలో వైభవంగా రిసెప్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మెమోరీస్ అప్ లోడింగ్

'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన బ్యూటీ త్రిప్తి డిమ్రి.. ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే స్టోరీలు, నటనలోని వైవిధ్యం అభిమానులను విపరీతంగా అలరిస్తున్నాయి. ఇక తన అందచందాలతో యూత్‌ను ఊపేస్తున్న ఈ నయా నేషనల్ క్రష్ .. ఇప్పుడు సోషల్ మీడియానూషేక్ చేస్తోంది. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది. తాజాగా ఈ భామ పోస్ట్ చేసిన చీరకట్టు పిక్స్ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, శారీలోనూ అంతటి హోయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్‌చేసిన ఈ ఫొటోలకు 'కాలం వీటిని జ్ఞాపకాలుగా మార్చేలోపు.. నా కథలో ఈ చాప్టర్‌ని అప్‌లోడ్ చేస్తున్న' అంటూ క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది త్రిప్తి. ఇక ఈ పిక్స్ చూసిన నెటిజన్లు 'స్టన్నింగ్ బ్యూటీ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఇక రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.